క్లుప్తంగా

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



కాకినాడలో విద్యార్థులను అభినందిస్తున్న ఆర్జేడీ అన్నపూర్ణ

పెదపూడి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.వెన్నలసాయి 585 మార్కులతో మండల ప్రథమ, పి.సాయితులసి 582 మార్కులతో మండల ద్వితీయ స్థానాలు సాధించారు. అలాగే అదే పాఠశాల స్థాయిలోనే బాలుర విభాగంలో పి.వీరకృష్ణ 552 మార్కులు సాధించాడు. ముగ్గురు విద్యార్థులను కాకినాడలోని జోన్ ఆర్జేడీ అన్నపూర్ణ, డీఈఓ రమేష్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారని పాఠశాల హెచ్ఎం త్రిమూర్తులు మంగళవారం తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



వాహనదారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రంగంపేట: ఎండలు మండిపోతున్న నేపథ్యంలో మండలంలోని ఎస్టీరాజాపురం గ్రామంలో తప్పనిసరై ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు సర్పంచ్ అడ్డాల పద్మా వెంకటేష్, పప్పు వెంకటేశ్వర్లు, లోవబాబు తదితరులు మంగళవారం మజ్జిగ ప్యాకెట్లు, మంచి నీరు పంపిణీ చేశారు.

మజ్జిగ పంపిణీ

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద స్థానికులు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మంగళవారం దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే చినకొండేపూడిలో శ్రీషిర్డీ సాయిబాబా వసతి మందిరం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో దాతల సహకారంతో మజ్జిగను పాదచారులకు, వాహన చోదకులకు అందజేశారు.

ఘనంగా శ్రీశ్రీ జయంత్యుత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

సీతానగరం: స్థానిక ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో మంగళవారం శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ ఆధునిక కవిత్వంతో శ్రీశ్రీ గొప్పదనాన్ని వివరించారు. తెలుగుశాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఎం. సుధామయి శ్రీశ్రీ సాహిత్యాన్ని, సినీ గేయాలను ఐసీటీ రూపంలో పీపీటీ ప్రెజంటేషన్ చేశారు. అనంతరం మధ్యాహ్నం విద్యార్థులను తెలుగు, చరిత్ర శాఖల ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ స్మారక ఆశ్రమానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాణి, ఫణీంద్ర కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు

మోడల్ పోలింగ్ బూత్ ఎంపిక



చినకొండేపూడిలోని మోడల్ పోలింగ్ బూత్

సీతానగరం: చిన కొండేపూడి ఎంపీపీ స్కూల్లోని 20వ నంబర్ బూత్‌ను మోడల్ పోలింగ్ బూత్‌గా ఎంపిక చేశారని తహసీల్దార్ బి.నెల్సన్ పాల్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆర్వో చైత్రవర్షిణి ఉత్వర్వులు జారీ చేశారన్నారు. ఇందులో భాగంగా ఆ పోలింగ్ బూత్‌ను అందంగా తీర్చిదిద్దారు. మూడు రోజుల పాటు దీనిని ప్రదర్శనకు ఉంచుతారు. అనంతరం పోలింగ్ రోజున అలాగే సిద్ధం చేస్తారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మి, వీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

రంగంపేట: పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మంగళవారం రంగంపేట సమీపంలోని డాక్టర్ గన్ని భాస్కరరావు పామాయిల్ తోటలో జరిగిన పామాయిల్ రైతుల సదస్సులో ఆమె మాట్లాడారు. గతంలో రూ.28000 ఉన్న టన్ను పామాయిల్ గెలల ధర ప్రస్తుతం రూ.13,800కు దిగజారి పోయిందని రాష్ట్ర పామాయిల్ రైతుల సంఘం అధ్యక్షుడు బొబ్బ రామారావు ఆమెకు వివరించారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పురందేశ్వరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పామాయిల్ రైతుల సంఘం అధ్యక్షుడు పెండ్యాల బుజ్జిబాబు, ఉండవిల్లి వెంకట్రావు, ముళ్లపూడి మురళీకృష్ణ, గన్ని భాస్కరరావు, లచ్చయ్యదొర, గడ్డం అమ్మిరాజు పాల్గొన్నారు.

రావుల చెరువుకు మహర్దశ

- రాతితో గట్లు పటిష్టం
- ఆకట్టుకుంటున్న పార్కు



అభివృద్ధి చేసిన అనంతరం రావుల చెరువు



చెరువుకు ఒక వైపున ఏర్పాటు చేసిన పార్కు



ఆకట్టుకుంటున్న జిమ్

రాజానగరం: గ్రామంలోని ప్రముఖ రావుల చెరువుకు మహర్దశ పట్టింది. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ఏవిధమైన ప్రక్షాళనకు నోచుకోకుండా పాలకుల నిర్లక్ష్యానికి గురై పూర్తిగా పనికిరాకుండా పోయిన దీనిని సర్వాంగ సుందరంగా అభివృద్ధి పర్చారు. చెరువు గట్టుపై పడమట వైపు ఆహ్లాదకరమైన పార్కును ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చొరవతో ఈ పనులు వేగవంతంగా జరిగాయి.

గ్రామ ఆవిర్భావానికి మూలం

రాజానగరం అనే గ్రామం ఆవిర్భావానికి ప్రధాన కారణంగా చెప్పుకునే రావుల చెరువుకు సుమారు 300 ఏళ్ల చరిత్ర ఉంది. ఆ సమయంలో రాజమహేంద్రవరం నుంచి కప్పం వసూలు కోసం పెద్దాపురం సంస్థానానికి జమీందార్ శ్రీరాజా కాండ్రేగుల జగన్నాథరావు బహదూర్ పంతులు వెళ్లి వస్తుండేవారు. అప్పట్లో ఇది ఒక దట్టమైన అటవీ ప్రాంతంగా ఉండేది. దారి మధ్యలో దప్పిక తీర్చుకునేందుకు ఒక కొలను వద్ద గుడారం వేసి, కొంతసేపు ఆయన సేద తీరేవారు. ఆ కొలనులో నీరు స్వచ్ఛంగా, రుచిగా ఉండేది. దీంతో ఆ దివానం ఇక్కడ ఒక గ్రామాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించారు. వెనువెంటనే చెరువుకు ఎదురుగా ఒక అగ్రహారాన్ని ఏర్పాటు చేసి, దానికి రాజానగరం అని పేరు పెట్టారు. గ్రామంలో శ్రీరాజగోపాలస్వామి, శ్రీరాజలింగేశ్వరస్వామి ఆలయాలను నిర్మించారు. కొద్ది దూరంలో రోడ్డును ఆనుకుని తన పేరుతో ఒక అన్నదాన సత్రాన్ని బాటసారుల కోసం నిర్మించారు.

కలుషితమయం

ఈ రావుల చెరువు నీటిని రాజానగరంతో పాటు పరిసరాలలోని మరో 15 గ్రామాల ప్రజలు తీసుకు వెళ్లేవారు. కాలక్రమేణా ఎక్కడిక్కడే బోర్లు పడటంతో నీటి కోసం పరిసరాల నుంచి వచ్చే ప్రజలు తగ్గిపోయారు. కానీ రాజానగరం వాసులకు ఈ చెరువు నీరే శరణ్యమైంది. ఇందుకు ప్రధాన కారణం ఇక్కడ బోర్లు పడవు, వేసినా ఎక్కువ లోతుకు వెళ్లాలి, అప్పుడు కూడా సల్ఫర్ వాటర్ వస్తుండటంతో వేసిన బోర్లు కూడా ఎందుకు పనికి రాకుండా పోయాయి. రాజానగరంతో పాటు శివారు గ్రామాలైన శ్రీరామనగర్, సూర్యారావుపేట వాసులకు కూడా రావుల చెరువు నీరు తప్పని సరైంది. ఇదే సమయంలో చెరువు గట్టు పరిసరాలు కలుషితమవడం, వర్షాలకు ఎగువ నుండి వచ్చి చేరే ముంపు నీరు మలినాలతో కూడి ఉండటంతో చెరువు పూర్తిగా పాడై బురదగా తయారైంది.

చెరువు అభివృద్ధి

పాడైపోతున్న చెరువును తాము అధికారంలోకి వస్తే బాగు చేయిస్తామంటూ గత రెండున్నర దశాబ్దాలుగా రాజకీయ నాయకులు ఎన్నికల అస్త్రంగా వాడుకున్నారు. కానీ చెరువు బాగు కోసం చిత్తశుద్ధితో పని చేయలేదు. రాజానగరం నియోజకవర్గ కేంద్రంగా ఏర్పడిన తరువాత వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పెందుర్తి వెంకటేష్ కూడా దీని అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించారు. 2019 ఎన్నికలలో జక్కంపూడి రాజా రావుల చెరువు అభివద్ధి పై హామీ ఇవ్వడమే కాకుండా గెలుపొందిన వెంటనే ఏర్పాటు చేసిన అధికారుల తొలి సమావేశంలోనే చెరువు అభివృద్ధి గురించి ప్రస్తావించి, కార్యాచరణ చేపట్టారు. దీంతో రావులచెరువుకు పూర్వ వైభవం వచ్చింది.

ఆహ్లాదపరుస్తున్న పార్కు

రావుల చెరువులో పేరుకు పోయిన మలినాలను తీసివేయడంతో పాటు గట్టును కూడా అభివృద్ధి చేశారు. గట్టు చుట్టూ రాతితో పటిష్ట పరిచి, అవసరమైన చోట పాంచాలను నిర్మించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వైపు ఏర్పాటు చేసిన పార్కు అందరినీ ఆకట్టుకుంటోంది. దీనిలో ఏర్పాటు చేసిన జిమ్‌కు పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తున్నారు.

అభివృద్ధి బాగుంది



చెరువు గట్టును చాలా బాగా అభివృద్ధి చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పార్కు పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ప్రతిరోజు స్కూలు నుంచి వచ్చిన ఇక్కడకు తీసుకువెళ్లాలని మారాం చేస్తున్నారు. పార్కులోని ఉయ్యాల, జారుడు బల్ల వారిని ఆకర్షిస్తున్నాయి.

– సుశీల, గృహిణి, రాజానగరం

సాయంత్రమైతే సందడి



రావుల చెరువు గతంలో మలినాలతో, దుర్వాసన వెదజల్లుతూ ఉండేది. ఇప్పుడు చాలా అందంగా తీర్చిదిద్దారు. చెరువు చుట్టూ గట్టును రాతితో పటిష్టం చేశారు. సాయంత్రం వేళలో చెరువు గట్టున ఉన్న పార్కు పిల్లలు, పెద్దలతో ఎంతో సందడిగా ఉంటుంది.

– కనకదుర్గ, స్కూల్ టీచర్, రాజానగరం

జగనన్న పాలన సంక్షేమానికి చిరునామా



కుతుకులూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి



రామవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- కుతుకులూరులో ఎన్నికల ప్రచారం

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన సంక్షేమానికి చిరునామాగా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి సత్తి ఆదిలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని కుతుకులూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించి ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఆమెకు మహిళలు ఇంటింటా హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మత, రాజకీయలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం జగనన్నతోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన భర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రామవరంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్ని పార్టీలతో జత కట్టినా రానున్న ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు. ప్రచార కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, కుతుకులూరు, రామవరం సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు సత్తి దొరయ్యరెడ్డి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, సబ్బెళ్ల నాగిరెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, చింతా సునీల్‌రెడ్డి, గుడిమెట్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి జగన్ నాయకత్వం అవసరం



వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు రాష్ట్ర ప్రజల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం అవసరమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జీబీఆర్ వాకింగ్, యోగా, షటిల్ కోర్ట్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులను కలుసుకున్న ఎమ్మెల్యే వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడంతో జగనన్న రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వి.రాజేష్ కుటుంబసభ్యులతో కలిసి బీజేపీని వీడి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు.

జగన్ పాలనలో పేదల సంక్షేమం

- డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ
- జోరుగా ఎన్నికల ప్రచారం



చీపురుపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

సీతానగరం: ముఖ్యమంత్రి జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదలందరూ ఆర్థిక అభ్యున్నతి సాధించారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా భార్య డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. మండలంలోని చీపురుపల్లి, అచ్చియ్యపాలెం, నాగంపల్లి గ్రామాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజా, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో రూ 1,773 కోట్లతో అభివృద్ధి, మరో రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్‌లు గోపిశెట్టి సత్య అనురాధ, దోసపాటి వీరచంద్రం, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గోపిశెట్టి అచ్చారావు, మన్నెల్లి వెంకట్రావు, మన్నెల్లి పెద్ద మరియమ్మ, బుక్కె లక్ష్మి, గొంతె పార్వతి, మన్నెల్లి చిన మరియమ్మ, గోపిశెట్టి పెద్ద తులసీరావు, దువ్వాడ జ్యోతి, బందుల మరియమ్మ, చొక్కా సురేష్, కోలా చక్రం, బుక్కె పోశియ్య పాల్గొన్నారు.

ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

మధురపూడి: పెరుగుతున్న ఎండలు రీత్యా నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన సూర్యకుమారి మాట్లాడుతూ పది పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు 81 శాతం ఉత్తీర్ణత సాధించడం, కణుపూరు హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలవడం అభినందనీయమన్నారు. సమావేశంలో ఎంపీడీఓ హేమ సుందరరావు, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ కోరుకొండ మండలం మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు పాల్గొన్నారు.

నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్



బిక్కవోలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బిక్కవోలు, పందలపాకల్లో ఎన్నికల ప్రచారం

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లో నిజాయతీకి, నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బిక్కవోలు, పందలపాక గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా బిక్కవోలు సుబ్బారాయుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై చెప్పాడంటే చేస్తాడంతే అనే నమ్మకం ప్రజల్లో కలిగిందన్నారు. 2024 ఎన్నికలకు కూడా చేయగలిగిన హామీలను మాత్రమే మేనిఫెస్టోలో పెట్టి ఎన్నికలకు సిద్ధమయ్యారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లు అహర్నిశలు శ్రమించారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపిస్తే ప్రతి పథకం ఇంటి గుమ్మం వద్దకే చేరుతుందన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని అభివృద్ధి జగనన్న హయాంలోనే జరిగిందన్నారు. పథకాలు పొందిన పేదలు, మళ్లీ జగనన్నను సీఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కోట్లాది కుటుంబాలకు మేలు చేసిన జగనన్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రాష్ట్రాన్ని 14 ఏళ్ల పరిపాలించానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు అండ్ కూటమిని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, బిక్కవోలు ఉపసర్పంచ్ డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి, గువ్వల సత్తిరెడ్డి, యామసాని రవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఆర్ఎస్‌పేట మాజీ సర్పంచ్ యామన దుర్గారావు, పందలపాక సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గండి వాసు, కొంకుదురు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు యాసలపు శ్రీనివాస్, ఎంపీటీసీ మచ్చాపాప, పడాల దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చేసిన మేలును గుర్తు చేసుకోండి

- సంక్షేమ పాలనకు మద్దతు తెలపండి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో మహిళలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని, పొందిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లాలాచెరువు హెచ్‌బీ కాలనీ, పాత వెలుగుబంద, కొత్త వెలుగుబందలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు ముఖ్యంగా మహిళలు ఆయనకు హారతులిస్తూ, తిలకం దిద్దారు. మీరే మా ఎమ్మెల్యే, జగనే మా సీఎం అంటూ నినాదాలిచ్చారు. ఎన్నికల ప్రచార రథంపై ఆయా గ్రామాలలో పర్యటిస్తూ, కొన్నిచోట్ల రథం దిగి ప్రజలల్లోకి వెళ్లారు.

20,128 మందికి నివాస స్థలాలు

పేదల కష్టాలను స్వయంగా తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో ఒకేసారి 31 లక్షలకు పైబడి పేదలకు నివాస స్థలాలు అందజేశారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. వీటిలో రాజానగరం నియోజకవర్గంలో 20,128 మంది ఇళ్లపట్టాలను అందుకుని, ఇళ్లు కూడా నిర్మించుకుంటున్నారన్నారు. గతంలో అధికారంలో ఉన్న పాలకులు ఇంటి స్థలం అంటే నీచంగా చూసే వారని, ఆ సంఘటనలను, ఆ నాయకులను మరువరాదన్నారు. పొరబాటున వారికిగాని అవకాశం ఇస్తే పాట్లు తప్పవన్నారు. అధికారం దాహంతో ప్రతిపక్షాలు మీ ముందుకు వచ్చి ఇష్టానుసారంగా హామీలిస్తున్నాయని, గతంలో ఇలాగే హామీలిచ్చి ఏం చేశారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతిని కోరుకుంటూ, జనరంజక పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. రానున్న ఎన్నికలలో తనను ఎమ్మెల్యేగా, డాక్టర్ శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ సత్తా చాటుదాం

- చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించండి
- పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే రాజా, డాక్టర్ శ్రీనివాస్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా, ఎంపీ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్

రాజానగరం: సామాజికవర్గ సమీకరణలు చేసుకుంటూ జనసేన నాయకులు పగటి కలలు కంటున్నారని, ఈ సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ సత్తా ఏమిటో వారికి తెలియజేయాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని చక్రద్వారబంధంలో మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి రాజానగరం కంచుకోటని, ఆ విషయాన్ని భారీ మెజార్టీతో గెలిచి నిరూపిద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గతంలో నియోజకవర్గంలో ఎవ్వరూ చేయనంత అభివృద్ధి, అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఈ విషయాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు గుర్తు చేస్తూ చైతన్యపర్చాలన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజా ఐదేళ్లలో నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి పనులు చేపట్టారని, విశాలమైన రోడ్లు, పక్కా డ్రైనేజీలతో ప్రజలకు అవసరమైన అనేక మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. వీటనన్నింటినీ ప్రజలకు వివరించి, ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరాలన్నారు.

ఆదర్శ గ్రామంగా ఫరిజల్లిపేట

రాజానగరం: ఫరిజల్లిపేటను ఆదర్శ గ్రామంగా మార్చేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రయత్నం చేస్తుందని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు అన్నారు. ఆ గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి జిల్లాలో ఈ గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. ఇందుకు అవసరమైన పూర్తి సహాయ, సహకారాలను ప్రజల నుంచి కోరుతున్నామన్నారు. న్యాయ పరమైన సమస్యలను, వివాదాలను పరిష్కరించి, వివాద రహితంగా మారుస్తామన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను, ఫిర్యాదులను తమ సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రెహమాన్, సీఐ కాశీ విశ్వనాథ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.లలిత, సీడీపీఓ నాగమణి, లాయర్ డి.వెంకటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ వరప్రసాద్, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి బాస్కెట్‌బాల్ శిక్షణ

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి వేసవి ఉచిత బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి గౌరీశంకర్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ శిబిరంలో ఈ నెలాఖరు వరకూ ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకూ శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి చిర్ల వెంకటకృష్ణారెడ్డి, కోశాధికారి ద్వారంపూడి యువరాజారెడ్డి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సీతానగరం: మండలంలోని చీపురుపల్లికి చెందిన కురుకూరి కృపమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఎస్సీ అయిన కృపమ్మను చినకొండేపూడికి చెందిన కురుకూరి శ్రీనివాస్ రెండో వివాహం చేసుకున్నాడు. వారికి 19 ఏళ్ల కుమార్తె ఉంది. కాగా.. 2021లో శ్రీనివాస్ మరణించాడు. కృపమ్మ ఆస్తి విషయంపై శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో ఘర్షణ తలెత్తింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని, డీఎస్పీ దర్యాప్తు చేస్తారని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

453 మందికి వైద్యసేవలు

సీతానగరం: వంగలపూడిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో 453 మందికి వైద్య పరీక్షలు అందించారు. డాక్టర్లు మౌనిష్, శవురియా సుమన, ఎస్.రాజు, కంటి నిపుణుడు టి.ఆనంద్ కుమార్ తదితరులు వైద్యసేవలు అందించారు. ముగ్గురిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు.